సాగు రంగాన్ని ప్రోత్సహిద్దాం ..

- చిన్న సన్నకారు రైతులకు అండగా ఉండాలి..
- మన వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా పరిశోధలు జరగాలి
- వర్సిటీ వజ్రోత్సవ ముగింపు సభలో రాష్ట్ర విద్యా కమిషనర్ డా. ఆకునూరి మురళి

వర్సిటీ వజ్రోత్సవ ముగింపు కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్తలు , తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 21: సమాజానికి అన్నం పెట్టే రైతన్న, పరిశోధన, విస్తరణ, విద్యారంగానికి అంతా రుణపడి ఉంటామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలను రెండు రోజుల పాటు ఘనంగా జరుపుకుంది. చివరి రోజు శనివారం ఆడిటోరియం, క్రీడల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వంగడాలు సృష్టించడం, విస్తరణ, విద్యావిభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని కోరారు. అందులో భాగంగానే డ్రోన్‌ల వాడకం, శాస్త్ర సాంకేతిక రంగాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. దేశంలోనే వివిధ పంటల సాగుకు మన నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలమన్నారు. ఎక్కువగా చిన్న సన్నకారు రైతులకు అండగా ఉండాలని సూచించారు. మన వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా పరిశోధలు జరగాలని సూచించారు.

అనంతరం కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. రాజిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలను ప్రధానంగా ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లసాగు చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ, మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎరువులు, పురుగుల మందులను రైతులు అధికంగా వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రిన్సిపల్, క్లైమెట్ చేంజ్ స్పెషలిస్ట్, పూర్వపు విద్యార్థి, అంచా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం అత్యుత్తమ ర్యాంక్ సాధించాలని ఆయన అభిలాషించారు. డిజిటల్ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. తృణధాన్యాల సాగు పెంచాలని అమెరికాలోని క్యాన్సర్ స్టేట్ యూనివర్సిటీ ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొ.వరప్రసాద్ అన్నారు. వీసీ జాన య్య మాట్లాడుతూ.. రాష్ట్ర , దేశ వ్యవసాయ సర్వతోముఖాభివృద్ధికి, మానవ వనరుల అభివృద్ధికి వ్యవసాయ విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందన్నారు. సదస్సుకు పూర్వ ఉపకులపతి డా. సురవరం రఘువర్ధన్ రెడ్డి, మాజీ ఆర్థిక కార్యదర్శి నాగిరెడ్డిలు పాల్గొని ఉత్తమ రైతులకు , వి ద్యారంగంలో రాణించిన విద్యార్థులకు అవార్డులను అందజేశారని తెలిపారు . ఈ కార్యక్రమానికి అగ్రిహబ్ సీఈఓ విజయ్ అనుసంధాన కర్తగా వ్యవహరించారు.

ఇంత మంచి పంటలు చూస్తామనుకోలేదు..

మా చిన్నతనంలో ఏడాదికి ఒకే పంట, అది మెట్ట సకాలంలో చినుకు పడితే పండేది. బోర్లు వేస్తే అప్పులు మిగిలేవితప్పా బోరులో నీళ్లు వచ్చేవికావు. ఎండాకాలం అంతా బీళ్లుగా ఉండేవి. గత ఎనిమిదేళ్ల నుంచి తెలంగాణ ప్రభుత్వం వల్ల మా ప్రాంతానికి కాల్వ నీళ్లు (కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా) వస్తున్నాయి. వాటికితోడు మా సమీపంలో గల పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు మా గ్రామాలను దత్తత తీసుకుని సలహాలివ్వడం వల్ల మా పంటలు ఘననీయంగా పెరిగాయి. ఈ సారి వారి సలహాయంవల్ల 10 ఎకరాలు పత్తి, 4 ఎకరాలు మిర్చి, 5 ఎకరాలు మొక్కజొన్న సాగు చేశాం. పంటలు బాగానే ఉన్నాయి. మాతో పాటు 10 మందికి ఉపాధి కల్పి స్తున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– సింగిరెడ్డి లక్ష్మి, ఉత్తమ మహిళా రైతు , యత్మతా పూర్ , నాగర్ కర్నూల్ జిల్లా

సాగులో విప్లవాత్మక మార్పు వచ్చింది ..

గత ఐదేళ్ల సాగులో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఇదే యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. ఇతరుల పొలం లీజ్ తీసుకుని సాగు చేశాను. మాజీ సీఎం కేసీఆర్ పుణ్యమా అంటూ నాగార్జున సాగర్ లెఫ్ట్ కెనాలు, సాగు నీరు, ఉచిత 24 గంటల విద్యుత్, రైతు బంధు మాకెంతో ఉపయోగపడింది. ఈ ప్రభుత్వంకూడా అలా ఆదుకుంటుందని ఆశిస్తున్నా. మాకు సమీపంలో కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తల సూచనలు , సలహాల మేరకు పత్తి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్నాం. నా బ్యాచ్‌వారు అరకొర ఉద్యోగాలు చేస్తుండగా, నేను దాదాపు 20 మందికి ఉపాధి కల్పిస్తున్నా.

– పి.భాస్కర్ రావు , ఉత్తమ రైతు, మేడేపల్లి, ఖమ్మం జిల్లా

ఘనంగా త్రిపుర నూతన సంవత్సరాది వేడుకలు

త్రిపుర నూతన సంవత్సరాది వేడుకలు శనివారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా మహిళలు తెలంగాణ సంప్రదాయాన్ని చాటే బతుకమ్మ ఆడి ఆకట్టుకున్నారు. యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, త్రిపుర మహిళలతో బతుకమ్మ ఆడారు. రెడ్‌క్రాస్ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు. **– జూబ్లీహిల్స్, డిసెంబర్ 21**

26న కేవల్ కిషన్ ముదిరాజ్ జాతరకు తరలిరండి

హిమాయత్‌నగర్,డిసెంబర్21: తెలంగాణ పోరాట యోధుడు కేవల్ కిషన్ ముదిరాజ్ 64వ వర్ధంతి సందర్భంగా ఈనెల 26న మెదక్‌జిల్లా, చేగుంట మం డలం, పోలంపల్లి గ్రామంలో జరిగే జాతరకు సబ్బండ వర్గాలు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మద్దెల సంతోశ్, శైలేంద్ర శివయ్యలు పిలుపు నిచ్చారు.శనివారం హైదర్‌గూడ లోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహాసభ నేతలు బైండ్ల సత్యనారాయణ, బోయిని అంజనేయులు, దుర్గేశ్, శ్రీనివాస్, తలారి సంతోశ్, కృష్ణగౌడ్, ప్రభు, మల్లేశం పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలోనే ప్రజావాణి

బండ్లగూడ, డిసెంబర్ 21: రాజేంద్రనగర్ ఆర్‌డీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణిలో ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

13 వరకు ప్రవచనాలు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 21: పవిత్రమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకుని హిమాయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో డాక్టర్ కోగంటి వేణుగోపాల కృష్ణమా చార్యులచే తిరుప్పావై ప్రవచనములు 2025 జనవరి 13 వరకు జరుగుతాయని శనివారం ప్రకటనలో టీటీడీ తెలిపిం ది.

సుందరీకరణ పనులు ..

ఖైరతాబాద్, డిసెంబర్ 21 : నగర సుందరీకరణ పనుల్లో భాగంగా ఖైరతాబాద్ పై ఓవర్ కింద పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ మేరకు శనివారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి నేతృత్వంలో ఇంజినీరింగ్ అధికారులు స్థల పరిశీలన చేశారు. వారి వెంట మారుతీనగర్ బస్తీ అధ్యక్షుడు ఎం. మహేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కృష్ణ యాదవ్, మహేందర్ బా బు, ప్రసాద్ యాదవ్, మల్లా రెడ్డి, వేణు, తదితరులు ఉన్నారు.

అవగాహన వాక్..

ఖైరతాబాద్, డిసెంబర్ 21 :అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా నెక్లెస్‌రోడ్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వద్ద వాక్ ఫర్ హ్యూమానిటీ పేరుతో అవగాహన వాక్ నిర్వహించారు. నిర్వాహకులు వెంకటేశ్వ ర్లు, గోపాల్‌లు మాట్లాడుతూ.. గురు విశ్వ మూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ స్ఫూర్తి కుటుంబం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 29న అమీర్‌పేటలోని ఖమ్మం సంఘం భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

2కే రన్‌ను ప్రారంభిస్తున్న పద్మభూషణ్ ఈశ్వర వరప్రసాద రెడ్డి, దైవజ్ఞ శర్మ , తదితరులు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కలిసి రావాలి

ఖైరతాబాద్, డిసెంబర్ 21 : డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ నినాదంతో నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్ వద్ద శనివారం 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన పద్మభూషణ్ అవార్డు గ్రహీత కోడూరు ఈశ్వర వరప్రసాద రెడ్డి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో పనిచేస్తున్నాయని, డ్రగ్స్ గురించి అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తెలంగాణ విదాయ సమితి ప్రతినిధి పెండెం తారక్, రవి, గణేశ్, అశోక్ సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

గో రక్షణ, భూ రక్షణ, పర్యావరణ రక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన 4900 కిలోమీటర్ల గో మహా పాదయాత్రలో భాగంగా ఆయన శనివారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గురుస్వామి ఖైరతాబాద్ మహాగణపతి మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు సందీప్ ముదిరాజ్, మహేశ్ యాదవ్‌లు స్వాగతం పలికి అభినందించారు. **–ఖైరతాబాద్**

శివరాంపల్లి రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

డిమాండ్లను ఒప్పుకోక పోతే సమ్మె తప్పదు

ఏఎన్ఎంల హెచ్చరిక

బండ్లగూడ, డిసెంబర్ 21: తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని మూడు రోజులుగా ఏఎన్ఎంలు వందలాదిగా రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరును మార్చుకోవాలని మూడు రోజులుగా రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు ఏఎన్ఎంలు ధర్నా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఎన్ఎంలు శివరాంపల్లి వద్ద రోడ్డుపైకి వచ్చి శనివారం పెద్ద పెట్టున నిరసనలు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వయో పరిమితిని ఎత్తి వేయాలని, పెరిగిన జనాభా ప్రాతిపాదికన సబ్ సెంటర్లను మంజూరు చేయాలని, ఎన్‌హెఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రాత పరీక్ష లేకుండా అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 20 ఏండ్లుగా సేవలందిస్తున్న తమకు ఇప్పుడు రాత పరీక్షలు పెట్టడం అన్యాయమని, దానిని వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.తమ డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకోక పోతే సమ్మె బాట పడుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సమగ్ర కులగణనకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురండి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 21: దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ న్యూఢిల్లీలోని సీపీఐ జాతీయ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ డి.రాజా, మాజీ ఎంపీ అజీజ్‌పాషాలను శనివారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ .. ఓబీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో పాటు జాతీయ స్థాయి విద్యా విధానంలో ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దీనికి ఎంపీ డి.రాజా సానుకూలంగా స్పందించి బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి గిరగాని భిక్షపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతిలో పార్కుల అభివృద్ధి

మణికొండ, డిసెంబర్ 21: పార్కులను అధునాతన పద్ధతిలో అభివృద్ధి పరుస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులోని లక్ష్మీనగర్ కాలనీ బట్టర్ ఫ్లై పార్కు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్కు అభివృద్ధిలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ సకాలంలో పనులు చేపట్టాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రవికాంత్‌రెడ్డి, మల్లికార్జున్, కాంట్రాక్టర్ అనిల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పద్మశాలిపురంలో వివేకానంద టాలెంట్ టెస్ట్..

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 21: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, పద్మశాలిపురంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివేకానంద టాలెంట్ టెస్ట్-2024ను శనివారం నిర్వహించారు. రాజేంద్రనగర్ పరిధిలోని 26 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 2 వేల మంది విద్యార్థులు ఈ ప్రతిభ పరీక్షలో పాల్గొన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనవరి 12న శ్రీ రామకృష్ణా స్టూడెంట్స్ హోమ్‌లో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నారు. ఈ పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేలు, ప్రతి పాఠశాలలో ఉత్తమ ప్రతిభకనబరిచిన ఒక విద్యార్థికి 1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు సేవా సమితి సభ్యులు వెల్లడించారు.

శివరాంపల్లి పాఠశాలలో గణిత దినోత్సం

బండ్లగూడ, డిసెంబర్ 21: రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ .. రామానుజన్ గొప్ప మేధావి అని, ప్రపంచంలో గణిత ప్రాధాన్యతను ఆయన తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వెంకటయ్య, ఉదయ లక్ష్మి, కవిత, శ్రీ సంధ్య, రిజ్వాన, తదితరులు విద్యార్థుల చేసిన గణిత నమూనాలు పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి బహుమతులు అందజేశారు.

ఎంజీఐటీలో ..

మణికొండ, డిసెంబర్ 21: మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మెథమెటిక్స్, హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఒక రోజు గెస్ట్ లెక్చరర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీహెచ్ఈఎల్ మాజీ జనరల్ మెనేజర్ వి.కృష్ణ దత, కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ వి.హరిలీలలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల గణిత అధ్యాపకుడు డాక్టర్ శ్రీహరి, గణిత అధ్యాపకులు డాక్టర్ బాల్‌రెడ్డి, డాక్టర్ సుధ, డాక్టర్ శాంతి, డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

ఫుడ్‌ఫెస్టివల్..

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 21 : విద్యార్థులు నోరూరించే తినుబండారాల్లను తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. శనివారం హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ వారి సూచనల మేర కు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చే సిన పౌష్టికాహారాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలజ్యోతి పరిశీలించి అభినందించారు.

అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

హోంమంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత జంగయ్య

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 21 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెన్నక్కి తీసుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. అంబేద్కర్‌కు , ఆయన సిద్ధాంతాలకు బీజేపీ పూర్తిగా వ్యతిరేకమని మండిపడ్డారు. బాబా సాహెబ్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవించకూడదని మనుసంస్కృతి, ఆర్ఎస్ఎస్ భావజాలం కేంద్ర మంత్రి అమిత్‌షాకు నేర్పుతుందని ఆరోపించారు. దళితులను ఈసడించుకోవడమే పనిగా పెట్టుకున్న సంఘ్ పరివార్ సామాజిక న్యాయం కోరుకునే వారి స్ఫూర్తిప్రదాత డాక్టర్ అంబేద్కర్‌ను అవమానించడం అలవాటుగా మారిందన్నారు. అంబేద్కర్ అనడం ఫ్యాషన్ అయిపోయింది... ఇన్నిసార్లు భగవంతుడి పేరు తలిస్తే ఏడుజన్మల దాకా స్వర్గప్రాప్తికలిగేదని అన్న ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో మంత్రిగా కొనసాగాలంటే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని , లేనిచో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి బీజేపీ నీతిని దేశ ప్రజలకు వివరిస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో స్వచ్ఛత పక్వడపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఐసీఏఆర్, ఎన్ఏఏఆర్ఎం సంస్థలు సంయుక్తంగా డాక్టర్ లక్ష్మణ్ ఆహిరే, డాక్టర్ వెంకటకుమార్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్, తదితరులు హాజరై కాలనీ వాసులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.

– బండ్లగూడ, డిసెంబర్ 21

బంధువుల పొలానికి అని వెళ్లి.. వాగులో శవమై తేలాడు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 21 : రెండు రోజుల క్రితం బంధువుల పొలానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన వంటమాస్టర్ శనివారం కాచారం సమీపంలోని ఎంటేరువాగులో శవమై తేలాడు. ఈ సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన ధన్‌రాజ్ వంటమాస్టర్. ఈ నెల 18న తన బంధువు అయిన నారాయణ కాచారం గ్రామపరిధిలోని వ్యవసా య పొలం వద్దకు అని వెళ్లి తిరిగి రా లేదు. దీంతో పలు ప్రాంతాల్లో గాలించినా, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం కాచారం గ్రామ సమీపంలోని ఎంటేరువాగులో శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసు లు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 21 : ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాపూర్‌కు చెందిన అభినాష్ శంషాబాద్ పట్టణం, ఆర్బీనగర్ కాలనీలోని ఎంకేఎస్ బాలుర హాస్టల్‌లో ఉంటూ మండలంలోని వర్ధమాన్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా.. శనివారం మధ్యాహ్నం హాస్టల్‌లో గదిలో అభినాష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్ఎంసీ ప్లాంట్‌ను శాశ్వతంగా తొలగించాలి

మణికొండ, డిసెంబర్ 21: నార్సింగి మున్సిపాలిటీ మై హోమ్ అవతార్, హాల్ మార్క్ విసినియా సభ్యులు శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కలిశారు. ఎప్పటి నుంచో ప్రజలను పట్టిపీడిస్తున్న ఆర్ఎంసీ ప్లాంట్‌ను శాశ్వతంగా తొలగించే కార్యక్రమాన్ని తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం ద్వారా కోరారు. ఆయన వెంటనే పీసీబీ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫోన్ ద్వారా సమస్యను వివరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు పడటం చివరికి మై హోమ్ అవతార్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేసిన విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. వెంటనే పీసీబీ అధికారులు చర్యలు తీసుకొని క్లోజ్ చేసేందుకు ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే తానే స్వయంగా ప్రజలతో వచ్చి వారి సమస్యకు మద్దతుగా పోరాడుతానని హెచ్చరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మల్లేశ్, రామకృష్ణారెడ్డి, శ్రావణ్, శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో స్వచ్ఛత పక్వడపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఐసీఏఆర్, ఎన్ఏఏఆర్ఎం సంస్థలు సంయుక్తంగా డాక్టర్ లక్ష్మణ